క్లుప్తంగా

పాదయాత్రకు స్వాగతం



స్వాగతం పలుకుతున్న భక్తులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హద్నూర్‌కు చేరుకున్న పాదయాత్ర–పల్లకీ సేవా కార్యక్రమానికి గ్రామ పెద్దలు, భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఖేడ్ మండలం బెల్లాపూర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర పల్లకీ సేవా పాదయాత్ర రాఘవాపూర్, శంశోద్దీన్‌పూర్, మిర్జాపూర్(ఎన్), ముంగి మీదుగా సోమవారం రాత్రి హద్నూర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం గంగ్వార్, మిర్జాపూర్(బి) మీదుగా యాత్ర జహీరాబాద్‌కు చేరుకుంది. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ నాయకులు రాజ్‌కుమార్, భక్తులు సంగారెడ్డి, మహేష్, బక్కారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న చంద్రారెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధి జ్యోతినగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను కౌన్సిలర్ చంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించిందని, పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్‌లకు సూచించారు. మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు సీతామహాలక్ష్మి, రాజు, శారద, విజయ, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ తన్వీర్‌ను కలిసిన నాయకులు



తన్వీర్‌ను సన్మానిస్తున్న నాయకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): రాష్ట్ర మైనార్టీ కమిషన్ మెంబర్‌గా నియమితులైన మాజీ మంత్రి ఎండీ.ఫరీదోద్దీన్ కుమారుడు మహమ్మద్ తన్వీర్‌ను మండల నాయకులు మంగళవారం కలిశారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో నాయకులు జహీరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఆయనను కలిసిన వారిలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రవికుమార్, మల్గి సర్పంచ్ మారుతి, నాయకులు భాస్కర్, రాజ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్ గంగ్వార్, సయ్యద్ షకీల్, శ్రీపతి, సంగ్రాం పాటిల్, సంజీవయ్య, స్వామిదాస్, ఖలీల్ తదితరులు ఉన్నారు.

నేడు దత్తగిరికి అనుప్ జోలాట

ఝరాసంగం(జహీరాబాద్): ఆధ్యాత్మిక క్షేత్రం బర్దీపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో కొనసాగుతున్న దత్తగిరి మహారాజ్ శతజయంతి ఉత్సవాలకు అంతర్జాతీయ కళాకారుడు అనుప్ జోలాట బుధవారం రానున్నట్లు ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్ తెలిపారు. ఈ సందర్భంగా అనుప్ జోలాట బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక సంగీత కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

16న హనుమాన్ దీక్షలు ప్రారంభం

నారాయణఖేడ్: ఖేడ్ మండలం కొండాపూర్ ప్రాచీన హనుమాన్ ఆలయంలో ఈనెల 16న హనుమాన్ దీక్షాదారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు తెలిపారు. ఆలయ పీఠాధిపతి సంగ్రాం మహారాజ్ చేతుల మీదుగా దీక్షాదారణ ఉంటుందని, దీక్షలు స్వీకరించే భక్తులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠ

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లో మైసమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను బుధవారం ప్రారంభించనున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు తెలిపారు. ఉదయం 8 గంటలకు ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమం నుంచి అమ్మవారి విగ్రహాన్ని తీసుకువచ్చి, సరస్వతి హోమం, ధాన్యవాసం నిర్వహిస్తారు. రెండో రోజు చండీయాగం, బోనాలు, అన్నదానం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే హోమాల్లో 150 మంది దంపతులు పాల్గొంటారని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



మైసమ్మ ఆలయం



జోగిపేట: క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే క్రాంతికిరణ్, నాయకులు



పటాన్‌చెరు టౌన్: నీలం మధు నివాసం వద్ద హోలీ సంబరాల్లో యువత



జహీరాబాద్: దత్తగిరి కాలనీలో వేడుకల్లో చిన్నారులు

ఉత్సాహంగా హోలీ సంబరాలు

జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నా, పెద్ద, యువత కేరింతల నడుమ వివిధ రకాల రంగులను చల్లుకుంటూ ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు.

జోగిపేట(అందోల్): అందోలు నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణంలో హోలీ సంబరాలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అందోలు క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్లు, యువతతో కలిసి రంగులు చల్లి హోలీ శుభాకాంక్షలను తెలిపారు. బృందావన్ కాలనీలో అల్లె శ్రీకాంత్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

పటాన్‌చెరు టౌన్: అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకునే పండగ హోలీ అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు అన్నారు. మంగళవారం చిట్కుల్ గ్రామంలో హోలీ పండుగ సందర్భంగా గ్రామస్తులు, యువతతో కలిసి మధు రంగులు చల్లి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత పండగలకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. కార్యక్రమంలో యువకులు, సభ్యులు పాల్గొన్నారు.

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణం రాజీవ్‌చౌక్‌లో భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో డ్రమ్ముల్లో రంగులు నింపి యువకులు, పిల్లలు పరస్పరం చల్లుకుంటూ హంగామా చేశారు. శివార్‌సంద్ తండాలో సేవాఘడ్ దక్షిణకాళికామాత ఆలయం ఆవరణలో ఆలయ పీఠాధిపతి జగదీశ్వరానంద్ మహారాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ గోర్‌బంజారా సంస్కృతి, సంప్రదాయాలతో నృత్యాలు చేశారు.



సంగారెడ్డి టౌన్: రెవెన్యూ ఉద్యోగులతో కలెక్టర్ సంబరాలు

జహీరాబాద్: పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. దత్తగిరి కాలనీ, సాయినగర్ కాలనీ, ఎన్‌జీఓ, ఎస్‌బీహెచ్, శ్రీరాం, రాచన్నపేట, శాంతినగర్, హౌసింగ్‌బోర్డు తదితర కాలనీల్లో వేడుకలు నిర్వహించారు.

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని తడ్కల్, కంగ్టి, ముర్కుంజాల్, దామర్‌గిద్దా, బాన్సువాడ తదితర గ్రామాలతో పాటు తండాల్లో సైతం వేడుకలు ఘనంగా నిర్వహించారు. తడ్కల్ సర్పంచ్ మనోహర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం హోలీని ప్రజలు జరుపుకున్నారు. గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద కామదహనం కార్యక్రమం నిర్వహించారు. న్యాల్‌కల్‌లో ప్రజలు, యువకులు ప్రధాన వీధుల గుండా హోలీ నినాదాలు చేస్తూ రంగులు చల్లుకున్నారు.

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారంలో ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశంగౌడ్, గుమ్మడిదలలో జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, సర్పంచ్ నర్సింహ్మారెడ్డిల ఆధ్వర్యంలో హోలీ సంబురాలను జరుపుకున్నారు.

మునిపల్లి(అందోల్): మండలంలోని ఆయా గ్రామాల్లో హోలీ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ రకాల రంగులను చల్లుకొని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని జీర్లపల్లి, కృష్ణాపూర్ గ్రామాల్లో పెద్దా చిన్నా తేడా లేకుండా రంగులు చల్లుకున్నారు.



నారాయణఖేడ్: హోలీ సంబరాల్లో యువకులు



కంగ్టి(నారాయణఖేడ్): తడ్కల్‌లో రంగులు చల్లుకుంటున్న యువకులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని ఎడ్లబజార్ బసవేశ్వర, శ్రీసంగమేశ్వర మందిరం ప్రాంతాలతో పాటు ఆత్మకూర్ బేస్, కోహిర్ బేస్, చాకలికేరి, రాఘవేంద్రనగర్, గణేష్‌కట్టా, హనుమాన్‌నగర్, సిద్దాపూర్ కాలనీలతోపాటు పట్టణ వ్యాప్తంగ హోలీ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని దౌల్తాబాద్, దూలాపూర్, మంగాపూర్, దేవులపల్లి, కాసాల, గుండ్ల మాచును, చింతలచెరువు, కొత్తగూడెం, షేర్ఖాన్‌పల్లి తదితర గ్రామాల్లో హోలీ సంబరాలను జరుపుకున్నారు.



ఝరాసంగం(జహీరాబాద్): కృష్ణాపూర్ వేడుకల్లో చిన్నారులు, యువత



న్యాల్‌కల్: యువత, చిన్నారుల కేరింత



సదాశివపేట: సంగమేశ్వర ఆలయం వద్ద



జహీరాబాద్: సాయినగర్ కాలనీలో..



న్యాల్‌కల్: హోలీ ఆడుతున్న యువత



జిన్నారం: రంగులు చల్లుకుంటున్న చిన్నారులు



హత్నూర: సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం



సంగారెడ్డి: రంగులతో యువకులు

నూతన కార్యవర్గం నియామకం



నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న జాన్‌వెస్లీ

జహీరాబాద్ టౌన్: మెథోడిస్ట్ యూత్ ఫెలోషిప్ జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. రెవ.జార్జ్ బి గార్డెన్ మెమోరియల్ మెథడిస్టు సెంటర్ చర్చిలో ఆదివారం డిస్ట్రిక్ట్ సూపరింటెండెంట్ రెవ.కే.ఎల్ జాన్ వెస్లీ, రీజినల్ కాన్ఫరెన్స్ యూత్ డైరెక్టర్ రెవ.అమర్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. మెథోడిస్ట్ యూత్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడిగా స్వనీత్‌శీల్ బాబి, ఉపాధ్యక్షుడిగా డిప్రెండ్స్, ప్రధాన కార్యదర్శిగా కే.శర్విక్, కోశాధికారిగా శ్రావణ కుమార్, ఇవాంజిలిస్ చైర్ పర్సన్‌గా స్టీవెన్, సభ్యులు అశోక్, సాల్మన్ రాజ్, ప్రవీణ్ కుమార్, లాలప్పను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూత్ డైరెక్టర్ పాస్టర్ జోయల్ ఇమ్మానియేల్, హైదరాబాద్ యూత్ ప్రెసిడెంట్ వినయ్‌రాజ్, అసిస్టెంట్ పాస్టర్ ఇజ్రాయేల్, జిల్లా కార్యదర్శి రవికుమార్, జిల్లా లీడర్ డాక్టర్ సరీన్ జాన్, యూత్ డైరెక్టర్ డీఏ ప్రసాద్, రాజకుమార్, పాస్టర్లు పాల్గొన్నారు.

నేడు పటాన్‌చెరులో హోలీ సంబురాలు

పటాన్‌చెరు: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణం మైత్రి మైదానంలో హోలీ సంబరాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పరస్పర ప్రేమాభిమానాలు చాటేలా మోదుగపూలతో చేసిన సహజ సిద్ధ రంగులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గాయకులతో సంగీత విభావరి కార్యక్రమం ఉంటుందని, అందరూ పాల్గొనాలని కోరారు.

నేడు ఇంటర్వ్యూలు

రాయికోడ్(అందోల్): మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాయికోడ్ ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశం తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయని, అభ్యర్థులు విధిగా హాజరు కావాలని సూచించారు.

ఘనంగా సంగమేశ్వరస్వామి ఉత్సవాలు

కొడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాలలో సంగమేశ్వరస్వామి ఆలయ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జాతరలో భాగంగా మంగళవారం హోలీ సందర్భంగా ఆలయంలోని శివలింగానికి ఆలయ అర్చకుడు తమ్మలి శ్రీహరి ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద బండ్లను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరహరి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు నవీన్‌గుప్తా, ఉపసర్పంచ్ మాధవారెడ్డి, వెల్మకన్న సర్పంచ్ రాజేందర్, నాయకులు గౌరీరెడ్డి, అశోక్, రమేశ్‌గౌడ్, రాయగిరి, ఎల్లం పాల్గొన్నారు.



జాతరలో బండ్లను ఊరేగిస్తున్న భక్తులు

కాలక్షేపానికి వెళ్లి.. కుస్తీలో ఆరితేరి

- జాతీయస్థాయిలో రాణిస్తున్న క్రీడాకారిణి
- ఒలింపిక్ మెడల్ లక్ష్యంగా ముందుకు



కుస్తీ పోటీల్లో సాధించిన పతకాలతో కారుణ్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పురుషులే కఠినంగా భావించే కుస్తీ క్రీడను అవలీలగా నేర్చుకొని... జాతీయస్థాయిలో రాణిస్తోంది ఆ యువతి. ఆమె పోరాట పటిమకు దాసోహమంటూ బంగారు పతకాలు మెడలో ఆభరణంగా వచ్చిచేరుతున్నాయి. వేసవి సెలవుల్లో కాలక్షేపం కోసం నేర్చుకున్న కుస్తీనే ఆమెకు నేడు జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టింది. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన రామచంద్రాపురానికి చెందిన సుంకు కారుణ్య.. బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెకండియర్ చదువుతుంది. పదో తరగతి అనంతరం వేసవి సెలవుల్లో ఖాళీ ఉండలేక గచ్చిబౌలిలో కుస్తీ క్రీడాశిక్షణ శిబిరంలో చేరింది. కోచ్ అందించిన మెలకువలను నేర్చుకున్న కారుణ్య, తండ్రి హరిబాబు ప్రోత్సాహంతో ప్రత్యేక శిక్షణతో తర్ఫీదు పొందింది.

పతకాల బాట

2017లో శిక్షణ పూర్తిచేసుకున్న కారుణ్య అదే ఏడాది నార్సింగ్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైంది. 2018లో హర్యానాలోని సాయి అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీల్లో పాల్గొంది. 2019 మహారాష్ట్రలో ఆరు నెలల ప్రత్యేక శిక్షణకు వెళ్లింది. ఆ సమయంలో అద్దె గదిలో ఉంటూ స్వయంగా వంట చేసుకుంటూ శిక్షణ పొందింది. అనంతరం ఢిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని కాంస్యం సొంతం చేసుకుంది. 2022లో మహారాష్ట్రలో జరిగిన జాతీయస్థాయి కుస్తీ పోటీల్లో బంగారు పతకం, హైదరాబాద్‌లో నిర్వహించిన కొత్వాల్ కేసరి కుస్తీ పోటీల్లో బంగారు పతకం సాధించింది. జిల్లా, రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో 20 బంగారు పతకాలు, జాతీయ స్థాయిలో కాంస్యం, బంగారు పతకాలను సాధించి సత్తా చాటుతోంది.

ఒలింపిక్ మెడల్ లక్ష్యం

కుస్తీ కఠినమైన క్రీడ అయినా.. ఎంతో ఇష్టంతో నేర్చుకున్నా. శిక్షణ సమయంలో నేర్చుకున్న మెలకువలతో పోటీల్లో పాల్గొనే ధైర్యం వచ్చింది. కుటుంబసభ్యులు ప్రోత్సహించడంతో జాతీయస్థాయిలో రాణిస్తున్నా. ప్రభుత్వం అండగా నిలిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తా. ఒలింపిక్ మెడల్ సాధించడమే నా లక్ష్యం.



– సుంకు కారుణ్య, కుస్తీ క్రీడాకారిణి

హరిత లక్ష్యం ఆమడ దూరం

- నీరు లేక ఎండుతున్న మొక్కలు
- పట్టించుకోని అధికారులు



మంగంపేట నర్సరీలో మొక్కల దుస్థితి

జిన్నారం(పటాన్‌చెరు): రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచే లక్ష్యంతో ప్రభుత్వం హరితహారం కార్యక్రమం చేపట్టింది. కోట్ల రూపాయాలు ఖర్చు చేసి గ్రామాలు, ఖాళీ స్థలాలు, రోడ్ల వెంట మొక్కలను నాటుతోంది. వీటి పర్యవేక్షణను పంచాయతీ అధికారులకు అప్పగించింది. కాగా అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో లక్ష్యం నీరుగారుతుంది. మొక్కల రక్షణను పట్టించుకోకపోవడంతో మొక్కలకు నీరందక ఎండిపోతున్నాయి.

మండల వ్యాప్తంగా..

- జిన్నారం మండలంలో 15 గ్రామ పంచాయతీల పరిధిలో, 10 మదిర గ్రామాలు ఉన్నాయి.
- 15 గ్రామాల్లో అధికారులు మొక్కలను పెంచేందుకు గాను నర్సరీలను ఏర్పాటు చేశారు.
- గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నర్సరీల ద్వారా మొక్కలను పెంచి నాటాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.
- మండలంలోని మంగంపేట, లక్ష్మీపతిగూడెం, వావిలాల, జంగంపేట, కొడకంచి, మాదారం తదితర గ్రామాల్లో అధ్వాన్నంగా మారాయి.
- గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులు పట్టించుకోకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి.
- ఏటా జిన్నారం మండలంలో లక్ష మొక్కలు నాటే లక్ష్యంతో అధికారులు నర్సరీలను ప్రారంభించారు.
- నర్సరీలో నీటి సౌకర్యం లేక, ఎండలను తట్టుకునేందుకు షేడ్ నెట్ తదితర సౌకర్యాలు లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం

గ్రామాల్లో నర్సరీలో మొక్కల రక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. ఎండిన మొక్కల స్థానంలో కొత్తవి నాటిస్తున్నాం. నర్సరీ నిర్వహణపై నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై చర్యలు తప్పవు.

– రాములు, ఎంపీడీఓ, జిన్నారం